కథ

# ప్రేమా..ప్రేమా!

''భూమి సూర్యుడిని ప్రేమించింది. చంద్రుడు భూమిని ప్రేమించాడు. సూర్యుడి చుట్టూ భూమీ...భూమి చుట్టూ..చంద్రుడూ...ఆగకుండా అలా... తిరుగుతూనే ఉంటారు.

ఆ తిరుగుడూ ఆగదు.. ఈ ప్రేమలూ ఫలించవు..

ఇది...ఈ 'నూతన్'' కనిపెట్టిన సిద్ధాంతం.''

చుట్టూ చేరిన మిత్రులు చప్పట్లు చరుస్తూండగా తన సిద్ధాంతాన్ని వాళ్ళ ముందు ఆవిష్కరించాడు నూతన్.

''ఇంతకీ చెప్పొచ్చేదేమంటే....ఈ టీనేజ్ ప్రేమలు కూడా.. అలాంటివే. ఎవరు...ఎవర్ని...ఎందుకు... ఎప్పుడు...ఎలా ప్రేమిస్తారో... ఎవరికీ తెలీకపోవడమే...ప్రేమలో మజా'' అంటూ తన సిద్ధాంతాన్ని వివరించి మిత్రుల ప్రశంసలందుకొన్నాడు మరోసారి.

''ఐయాం సారీ..మిస్టర్..నూతన్...మీ సిద్ధాంతం శుద్ధ అబద్ధం.. ప్రేమ అనేది దేవుడు మనిషికి ఇచ్చిన వరం. ప్రేమలేని జీవితం పరిపూర్ణం కానేకాదు. ఇతరుల నుండి ఏ ప్రతిఫలమూ ఆశించకుండా...ఆరాధించడమే అసలు ప్రేమంటే. ప్రేమకి స్వార్థం ఉండకూడదు. చెట్టునీ..కుక్కనీ, కొండ నీ..గాలినీ.. ధ రాళినీ.. ఆకాశాన్నీ..దే న్నైయినా...ప్రేమించగల్గడమే....అసలైన ప్రేమ''

తన నిర్వచనాన్ని గుక్కతిప్పుకోకుండా చెప్పేసి గ్లాసుడు మంచినీళ్ళు గటగటా తాగేశాడు సుబ్బారావ్...ఫిలాసఫర్లా ఫీలయిపోతూ.

''ఓరి నాయనా..అలాగైతే నువ్వు ఆ కుక్కల్నీ, చెట్లనీ, పుట్లనీ ప్రేమించుకుంటూ శేషజీవితాన్ని కాస్త రామా, కృష్ణా అనుకుంటూ గడిపెయ్''

సూబ్బారావుని ఎగతాళి చేస్తూ అన్నాడు దాసు.

అందరూ వంతపాడినట్టు..బిగ్గరగా నవ్వేశారు.

సుబ్బారావు ముఖం చిలగడ దుంపయ్యింది.

''ప్రేమంటే పద్మవ్యూహం..
ప్రేమంటే తీరని దాహం
ప్రేమంటే ఒక వ్యామోహం
అందుకనే ప్రేమకి నే దాసోహం''

కవితావేశాన్ని ఆపుకోలేక....కట్టలు తెంచుకున్న ఉద్రేకంతో తన 'ప్రేమ కవితా ప్రవాహాన్ని' జనం మీదికి మళ్ళించాడు 'కవిరావు' అని పిలిపించుకునే కందిబట్ల వినాయకరావు.

పర్స్ ఫుల్లయితే...ప్రేమ థ్రిల్లవుతుంది.

కేష్ నిల్లయితే...ప్రియురాలు డల్లవుతుంది.

స్వానుభవాన్ని వివరించేడు సుభాష్.

ఇంతలో అతన్ని ఆటపట్టిస్తూ దాసు మళ్ళీ గొంతు సవరించుకుని..అతని బాధకి ముగింపు పలికాడిలా-

''వాళ్ళన్న చూస్తే..నీ ఒళ్ళు గుల్లవుతుంది'' అని.

అంతా మరోసారి నవ్వారు.

వాళ్ళంతా..ఇంతకీ..ఇంటర్ చదువుతున్న కుర్రాళ్ళు.

కంబైన్డ్ స్టడీసంటూ.. అందరూ కల్సి సుబ్బారావు రూంలో చేరి చర్చని ప్రేమవైపు మళ్ళించారు.

వీళ్ళందరితో..తనకేం పని లేదన్నట్టు..పుస్తకాల పేజీలని టపా టపా తిరగేస్తూ తనదైన చదువుల లోకంలో 'పురుగు'లా తిరుగుతూ మరో జీవి ఉన్నాడు ఆ రూంలో...అతనే...సత్తిపండు.

''ఒరేయ్...సత్తి పండుగా...నువ్వీ మాటలన్నీ వినకుండా...చదూకో...లేకుంటే..అనవసరంగా చెడిపోతావ్. అసలే పరీక్షల్లో మాలాంటి పతితులను ఆదుకొనే ఆశాజ్యోతివి...నువ్వు వెలుగుతుంటేనే..మేమందరం ప్రకాశించగలం'' గలగలా చెప్పాడు దాసు.

సత్తిపండుకి తన పేరంటే భలే చిరాకు. చక్కగా మోడర్న్‌గా ఉండేట్టు, హృతిక్ అనో రోషన్ అనో పెట్టక...సత్తిపండంటూ.. 'చింతపండు' లాంటి పేరు పెట్టిన తండ్రిని చాలాసార్లు తిట్టుకొంటూండేవాడు.

తను చదువులో ఎప్పుడూ ఫస్ట్ వస్తూ. టాప్ రేంకర్‌గా ఉన్నా..జనం మాత్రం ''పుస్తకాల పురుగనీ, పప్పుసుద్ద'' అని నిక్‌నేమ్ పెట్టి ఆటపట్టిస్తూండటం చిన్నతనంగా అనిపించేది.

స్నేహితులంతా సీరియస్‌గా ప్రేమ గురించి డిస్కస్ చేస్తూ తనని కనీసం మనిషిగా లెక్కించకపోవడం...తీవ్రమైన అవమానంగా భావించాడు సత్తిపండు.

అందుకనే..

ఆ క్షణంలోనే..

తనో దృఢమైన నిర్ణయానికొచ్చాడు, తనని ఎగతాళి చేసిన స్నేహితులంతా ఏడ్చేలాగ..తనో అందమైన అమ్మాయిని అర్జంటుగా ప్రేమించి.. తన వెంట తిప్పుకోవాలి. అది చూసి ఈ గేంగంతా కుళ్ళి కుళ్ళి చావాలి...అని.

సత్తిపండు ఇంటికి తిరిగొస్తూ..దారిపొడవునా, తనకాబోయే..ప్రేయసి గురించి అన్వేషిస్తూ..ఆలోచిస్తూ..ఆలోచిస్తూ..అదోలాంటి ఆనందాన్ని పొందాడు.

మధ్యలో 'టాబూ'...'సౌందర్య'ల వాల్ పోస్టర్లని చూసినప్పుడు.. తనకి ఇలాంటి ప్రియురాలు దొరికితే....జన్మ ధన్యమైపోతుంది. అనుకొన్నాడు. కాస్త అందంగా ఏ అమ్మాయి కనిపించినా..ఆమే తన ప్రేయసి అయితే...బాగుండును అని తెగ ఫీలయిపోతుండే వాడు.

ఇంటికొచ్చే సరికి...పదహారేళ్ళ పని మనిషి..పైడితల్లి వాకిలినంతా వయ్యారాలొలకబోస్తూ..ఊడుస్తుండడం చూసి..సత్తి పండు మనసంతా..'అదోలాగ' అయిపోయింది. పైడితల్లిని మాత్రం ఎందుకు ప్రేమించకూడదు? చాలా తెలుగు సినిమాలలో..హీరోలు, పనిమనుషుల్నీ, బజ్జీలు అమ్ముకొనే వాళ్ళనీ, కాఫీ హోటల్ పెట్టుకున్న వాళ్ళనీ..ప్రేమించడం మామూలే కదా..అనుకున్నాడు.

మంచి ముహూర్తం చూసుకొని పైడితల్లితో తన ప్రేమ ప్రయాణానికి శ్రీకారం దిద్దుదామని నిర్ణయించుకొనేసరికి...ఎక్కడ లేని ఆనందం కలిగింది.

కానీ అదేరోజు రాత్రి, అమ్మ..అమ్మమ్మతో మాట్లాడుతూ 'పైడితల్లి'కి మనువు కుదిరిందని చెప్పిన వార్త సత్తి పండు గుండెల్లో మందుపాతరలా పేలింది.

''ఆ...అయినా..ఇంకా తమ మధ్య ప్రేమ మొదలవలేదు కదా'' అని ఎలాగో గుండె దిటవు చేసుకున్నాడు.

చిట్ట చివరికి..

ఎలాగైతేనేం..తన క్లాసులో చదువుతున్న అమ్మాయిలందరినీ బాగా పరిశీలించాక..

అందరికంటే కాస్త నదురుగా కనిపించిన 'త్రివేణి' మీద మనసు పారేసుకున్నాడు.

ఎలాగైనా..సరే ఆమెని ప్రేమించి..తన వెంట తిప్పుకొని తీరాలని గట్టి ప్రతిజ్ఞ చేసుకొన్నాడు.

సంపంగి రేకులాంటి సుందరమైన ముక్కు, చేపపిల్లల్లాంటి కళ్ళు..నిమ్మ పండురంగుతో మిసమిసలాడే ఒళ్ళు..పాత కాలపు గడియారాలలో కదిలే లోలకంలా..పిరుదులు దాటి ఊగే జడ..ఉదయాన్నే పారిజాతపూలు..రాలినట్టు..ఆమె నవ్వే నవ్వు..సత్తిపండు 'ప్రేమ మంట'లో కోర్కెల 'నేయి'పోసి రాజేశాయి.

మరుసటి రోజు ఉదయం సత్తిపండు అవతారం చూసి మిత్రులంతా విస్తుపోయారు. ఉండుండీ హఠాత్తుగా వీడికేం పట్టుకొంది చెప్మా అని ఫీలయిపోయారు.

ఎప్పుడూ నూనె కారుతున్నట్టు జిడ్డుగా వుండే జుత్తు..షాంపూతో రుద్ది కండీషనర్ పెట్టడం వలన...బౌలింగ్ చేస్తున్నప్పుడు 'షోయబ్ అక్తర్' జుత్తులా.. గాలికి ఎగురుతూంది. మొట్టమొదటిసారిగా జీన్స్ పాంట్‌మీద టీషర్ట్‌ని టక్‌చేసి మొదటి సినిమాలో నటిస్తున్న హీరోగారి కొడుకులా తయారయ్యి కేంపస్‌లో తుఫాను రేపాడు సత్తిపండు.

క్లాస్ రూంలో కూర్చున్నది మొదలు లెక్చరర్స్ చెప్పే పాఠాలేవీ సత్తిపండు తలకెక్కడం లేదు. కళ్ళనిండా, తలపుల నిండా ఎటు చూసినా తన వలపుల రాణి..త్రివేణి రూపమే.

రెప్ప వెయ్యకుండా తన వంకే తదేకంగా చూస్తోన్న సత్తి పండు చూపులతో మొట్టమొదటిసారి త్రివేణి చూపులు కలిశాయ్.

సత్తిపండుకి నరనరాల్లో విద్యుచ్ఛక్తి ప్రవహించడం మొదలైంది.

ఆమె మళ్లీ చూసింది.

తను ఆమెనే చూస్తున్నాడు.

ఆమె మరోసారి చూసింది.

త నింకా... త దే కం గా... ఆ మె నే చూస్తూ...న్నా...డు.

అసంకల్పిత ప్రతీకార చర్యలాగ మాటిమాటికీ చూపులు కలుసుకోవడం మామూలైపోయింది. తనకి ఇంత త్వరగా రెస్పాన్స్ వస్తుందని ఊహించని సత్తిపండు, మనసు సంతోషంగా ఊయలలూగడం మొదలైంది.

రెండోరోజు త్రివేణి తన వంక చూసినపుడు చిన్నగా చిరునవ్వొకటి రువ్వి చూశాడు. చిత్రంగా ఆమె కూడా అలాగే నవ్వొకటి రువ్వి సత్తిపండు నరాలలో సరిగమలు పలికించింది.

తన ప్రేమ విజయానికి ఇదే తొలిమెట్టు అనుకున్నాడు. అయినా ఆమెతో మాట్లాడాలంటే బెరుకుగా వుండి ధైర్యం సరిపోలేదు. సత్తిపండు అలవాట్లలో కూడా విచిత్రమైన మార్పులొచ్చేశాయ్.

క్లాస్ రూంలో స్నేహితులతో మాట్లాడుతూ పెద్దగా జోక్ వేసి త్రివేణి నవ్వుతుందో లేదో అని ఆత్రుతగా చూసి ఆమె నవ్వితే, అదే తన అదృష్టంగా భావిస్తూ పులకించిపోయే వాడు.

కాలేజ్ అవగానే ఆమె వెనకాలే నడుస్తూ త్రివేణిని ఇంటి వరకూ సాగనంపడం అలవాటైపోయింది. ఆమె ట్యూషన్ టైమింగ్స్ తెల్సుకొని తను వచ్చే దారిలో నిలబడి ఎదురుచూస్తూండడం థ్రిల్లింగ్‌గా వుండేది.

ఇంత చేస్తున్నా...ఆమెతో ముఖాముఖీ మాట్లాడేందుకు సత్తిపండుకి ధైర్యం సరిపోలేదు. ఆమెతోనే కాదు అసలు ఏ ఆడపిల్ల తోటి మాట్లాడాలన్నా ఒళ్ళంతా చెమటలు పట్టి కాళ్ళు వణుకుతుంటాయ్.

కానీ ఎవరైనా 'త్రివేణి'తో మాట్లాడడం చూస్తే మాత్రం సత్తిపండుకి ఒళ్ళంతా కారం పూసుకున్నట్టుగా వుండేది. తన 'సొంత' ఆస్తిని ఎవరో బలవంతంగా తన్నుకుపోతోన్న ఫీలింగుతో విలవిలలాడిపోయేవాడు.

ఇలా కొన్నాళ్ళు గడిచాక ఇంక తన ప్రేమని ''వన్‌వే'' లోంచి ''హైవే'' మీదికి మార్చి తీరాలని నిశ్చయించుకున్నాడు.

''ప్రేమకి పిరికితనం తొలి శత్రువు''

''ప్రియురాలు లేని జీవితం పూవుల్లేని తోటలాంటిది''


లాంటి నినాదాలని నోటు పుస్తకం నిండా రాసి..రాసి..ధైర్యం తెచ్చుకొన్న తర్వాత తన ప్రేమకి టెస్ట్ పెట్టి చూడాలనుకున్నాడు.

త్రివేణి తన వంక చూసినప్పుడు..ఒక నవ్వు నవ్వాడు.

సమాధానంగా ఆమె నుండి చిరునవ్వు.

ఆమె మళ్ళీ చూసినప్పుడు సత్తిపండు ముక్కు గోక్కున్నాడు. కొద్దిసేపట్లోనే త్రివేణి కూడా ముక్కు గోక్కుంది.

''హమ్మయ్య...గ్రీన్ సిగ్నల్ దొరికింది'' అని సంబరపడుతూ ఈసారి చెవి గోక్కున్నాడు. త్రివేణి కూడా చెవి గోక్కుంది.



కుడి అరచేతిని నోటికి అడ్డుగా పెట్టి ''ఎగిరే ముద్దు'' ఒకటి సంబరపడుతూ ఆమెకి గురి పెట్టి వదిలాడు.

ఊహించినట్టే ఆమె నుండి కూడా అలాంటి ''ముద్దే'' బదులొచ్చింది. సత్తిపండుకి ఎగిరి గంతెయ్యాలనిపించింది. తన ప్రేమ ఇంత తొందరగా సక్సెస్ అవుతుందనుకోలేదు.

ఎక్కడ లేని ధైర్యం తెచ్చుకొని ఒక సాయంత్రం త్రివేణిని కలిశాడు. అటూ..ఇటూ... చూసి ఇష్ట దైవాన్ని మనసులో తలచుకుంటూ ఎలాగైతేనేం ''ఐ లవ్యూ'' అని చెప్పేశాడు.

ఆమె అతడిని చూస్తూ నవ్వింది. తర్వాత నెమ్మదిగా అంది-

''ఐయామ్ సారీ..సత్తిపండూ..ఐ కాంట్ లవ్ యూ..'' అని

సత్తిపండుకి కాలి క్రింద భూమి కదిలిపోతున్నట్లు...వెయ్యి ఓల్టుల విద్యుదాఘాతం తగిలినట్టూ. .అయ్యి కళ్ళ ముందర గెలాక్సీలు కదిలాయ్. ఎందుకు నవ్వావ్? నా 'ప్రేమ టెస్ట్'కి 'గ్రీన్ సిగ్నల్' ఎందుకిచ్చావ్?

అంటూ ప్రశ్నల వర్షంతో ముంచెత్తి ఆమెని నిలదీశాడు.

త్రివేణి..మరోసారి నవ్వింది.

''చూడు సత్తిపండూ..నావంక చూస్తూ నువ్వు..నీవంక చూస్తూ నేనూ ముక్కు మూడుసార్లు గోక్కోవడాన్నే నువ్వు ప్రేమ అని అనుకుంటే ఈ ఊరిలో సగం మంది మగాళ్ళు నా ప్రియులే.

నీలాంటి వాళ్ళందరికీ ఇదో ఆట అయిపోయింది. కళ్ళలో కళ్ళు పెట్టి చూడ్డం..ముక్కునీ, మూతినీ గోక్కుంటూ..అమ్మాయిలని టెస్ట్ చేశామని అనుకోవడం తీరా ఆ అమ్మాయి కొంచెం నవ్వుతూ మాట్లాడితే ''ఇదో పెద్ద కేసురా'' అంటూ చవుకబారు ప్రచారం చెయ్యడం.

ఇలాంటి ఆటలు బస్టాప్‌లో, బస్సుల్లో, టెంపుల్‌లో, కాలేజ్‌లో, మాలాంటి ఆడపిల్లలకి మామూలైపోయాయ్. నువ్వు 'సిగ్నల్స్' అనుకొన్నది కేవలం నేను నీతో ఆడుకున్న 'గేమ్' అసలు అమ్మాయిలకి కూడా వ్యక్తిత్వం ఉంటుందనీ...వాళ్ళకీ అభిప్రాయాలు ఉంటాయని తెల్సుకోకుండా, కాస్త అందంగా కనపడితే చాలు... ''ఐలవ్యూ'' అంటూ వేధించడమే.

అసలు ఇప్పుడు..మనది ప్రేమకోసం..వెంపర్లాడి వెర్రెత్తిపోవాల్సిన వయసేనా? బుద్ధిగా చదువుకుంటూ జీవితానికో లక్ష్యాన్ని ఏర్పరచుకోవలసిన సమయం..ఇది.

ఇంతకు ముందు నువ్వు ఎప్పుడూ ఫస్ట్‌రాంక్‌లో ఉండే వాడివి కానీ ఈమధ్య అది పదో ర్యాంకుకు పడిపోయింది. ముందు ఆ విషయం చూసుకో. ప్రేమా దోమా అంటూ చవుకబారు సినిమాల ప్రభావంతో 'టైం' వేస్ట్ చేసుకోకు''.

ఆమె చెప్పాల్సింది అయిపోయాక సీరియస్‌గా వెళ్ళిపోయింది. సత్తిపండు బుర్ర..భూమి చుట్టూ..చంద్రుడి చుట్టూ.. .సూర్యుడి చుట్టూ స్పుత్నిక్ అంత వేగంతో తిరుగుతోం...ది.

★

**గరిమెళ్ల వి.ఎస్.నాగేశ్వరరావు**